క్లుప్తంగా

కార్మికులకు దుస్తుల పంపిణీ


పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందిస్తున్న సర్పంచ్ వీరభద్రరావు

బిక్కవోలు: రంగాపురం గ్రామంలోని పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ గండికోట వీరభద్రరావు దుస్తులు పంపిణీ చేశారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద 12 మంది సిబ్బందికి దుస్తులు అందించారు. కార్యక్రమంలో అశోక్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు కేతా ఏసురత్నం, కనుమూరి సాయిరాజు, తానాటి అప్పలస్వామి, కనుమూరి సాయిరాజు, ఎస్.చిరంజీవి రాజు, చెల్లె జోషిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు మాజీ సైనికుల రాష్ట్ర సమ్మేళనం


డాక్టర్ సూరెడ్డి శివకుమార్

సీతానగరం: మాజీ సైనికుల రాష్ట్ర సమ్మేళనం ఆదివారం మంగళగిరిలో జరుగుతుందని వంగలపూడికి చెందిన ఏపీ రాష్ట్ర ఎక్స్ నేవల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ సూరెడ్డి శివకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ, బైలా ఆమోదం కోసం ఈ మెగా సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో ఉన్న మాజీ సైనికులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గతంలో విశాఖపట్నం, కడపల్లో రాష్ట్ర స్థాయి సమావేశాలు జరిగాయని, స్వయం ప్రకటిత రాష్ట్ర నాయకుల వలన మాజీ సైనికులకు ఆశించిన మేరకు సంక్షేమం జరగట్లేదన్నారు. ఎన్నికల ద్వారా సమర్థ రాష్ట్ర కమిటీని ఎన్నుకునేందుకు మంగళగిరి ఏపీ ఎస్పీ ఆరో బెటాలియన్ కన్వెన్షన్ హాల్‌లో జరిగే సమ్మేళనానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

నేడు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ప్రారంభించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ బి.హేమ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఉదయం 11 గంటలకు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభిస్తారన్నారు.

రెవెన్యూ సదస్సులో రెండు అర్జీలు


ఉండేశ్వరపురంలో అర్జీ పరిశీలిస్తున్న తహసీల్దార్

సీతానగరం: మండలంలోని ఉండేశ్వరపురంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రెండు అర్జీలందాయి. శుక్రవారం ఉండేశ్వరపురం సచివాలయంలో తహసీల్దార్ ఎ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ఫ్యామిలీ సర్టిఫికెట్లకు రెండు అర్జీలను అందుకున్నారు. శనివారం కూనవరంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్ రవీంద్ర, సర్వేయర్ గౌతమ్, వీఆర్వో విజయశ్రీ, ఎండోమెంట్ ఈఓ పాటి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఊలపల్లిలో..

బిక్కవోలు: ఊలపల్లి గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బీవీవీఎస్ కృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో భూ సమస్యలు ఉంటే పంచాయతీ కార్యాలయం వద్ద జరిగే సదస్సుకు వచ్చి దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

10న ఏకాహ మహోత్సవం

రంగంపేట: స్థానిక ఏడీబీ రోడ్డు పక్కన కొలువైన పద్మావతీ అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఈ నెల 10న ముక్కోటి ఏకాహ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు గ్రామ మాజీ ఉప సర్పంచ్ పోతుల వీరసుందరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆ రోజు తెల్లవారు జామున 4 గంటలకు గ్రామంలో నగర సంకీర్తన, స్వామివారికి అభిషేకం, అనంతరం గణపతి పూజతో అఖండ భజనావళి ప్రారంభం అవుతుందన్నారు. ఇందులో చంద్రమాంపల్లి, మర్లావ, వడిశలేరు, చంద్రేడు, రంగంపేటలకు చెందిన వివిధ భజన బృందాలు పాల్గొంటాయన్నారు. అనంతరం భజన బృందాల గురువులకు సత్కారం ఉంటుందన్నారు.

నేటి నుంచి ఎస్ఎంసీలకు శిక్షణ

మధురపూడి: కోరుకొండ మండలంలోని పాఠశాలల్లో స్కూలు యాజమాన్య కమిటీలకు శనివారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ నిర్వహిస్తున్నట్టు ఎంఈవో టి.కుశలవ దొర తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ శిక్షణ ఉంటుందన్నారు. వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

నాట్లు ముమ్మరంగా..

- రబీ వరి సాగులో డ్రమ్ము సీడర్‌తో ప్రయోజనాలెన్నో..!
- తీరనున్న కూలీల సమస్య
- క్రమ పద్ధతిలో వరి నాట్లకు అవకాశం
- ఖర్చు తక్కువ, దిగుబడి ఎక్కువ
- నీటి సమస్యకూ పరిష్కారం


డ్రమ్ము సీడర్‌తో విత్తనాలు చల్లే విధానాన్ని చూపిస్తున్న ఏఓ రమేష్

రాజానగరం: వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను ఆకళింపు చేసుకుని,, రబీలో ఎదురయ్యే నీటి సమస్యను అధిగమించి, ఖర్చును తగ్గించుకోవడంతో పాటు, మంచి దిగుబడులు సాధించేందుకు రైతులు ప్రయత్నం చేయాలని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఇందుకుగాను తాము రూపొందించి, వాడుకలో ఉన్న డ్రమ్ము సీడర్ ఎంతగానో ప్రయోజనం చేకూర్చుతుందంటున్నారు. ఇది మెట్ట ప్రాంతంలో వరి విత్తనాలు నాటే విధానానికి అనుకూలమైందిగా చెబుతున్నారు. దీనివలన సమయం ఆదా కావడంతో పాటు, కూలీల సమస్య ఉండదని, శ్రమ, ఖర్చు తగ్గుతాయని విశ్లేషిస్తున్నారు. ఈ సాధనాన్ని ఉపయోగించి వరి విత్తనాలను చల్లితే క్రమ పద్ధతిలో మొక్కలు రావడంతో పాటు, దుబ్బు బాగా కట్టి, మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. డ్రమ్ము సీడర్‌తో మొలకెత్తిన వరి విత్నాలను నేరుగా పొలాల్లో విత్తుకున్నట్లయితే, పంట త్వరగా రావడంతో పాటు, ఉత్పత్తి వ్యయం కూడా తగ్గుతుందని, దిగుబడి 5 నుంచి 10 శాతం వరకు పెరుగుతుందన్నారు. డ్రమ్ము సీడర్‌ని వినియోగించే విధాన్నాన్ని రైతులకు ప్రయోగాత్మకంగా కూడా చూపిస్తున్నారు. గత 17 ఏళ్లుగా జిల్లాలోని వివిధ గ్రామాల్లో ఈ పద్ధతిలో అనేక ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేసి, వరి సాగులో మంచి ఫలితాలు సాధించారు.

నీటి సమస్యకు చెల్లుచీటీ

పొలంలో నేరుగా విత్తనాలు చల్లాలన్నా, మడులు కట్టి నారు పెంచాలన్నా పొలంలో సమృద్ధిగా నీరు ఉండాలి. అంతేకాక కూలీల సమస్య కూడా ఎదురవుతుంది. ఆయా సమస్యలను పూర్తిగా అధిగమించేందుకు పొలాల్లో నేరుగా డ్రమ్ము సీడరుతో వరి విత్తనాలను నాటుకోవచ్చు. ఈ పరికరం తయారు చేసే విధానాన్ని కూడా కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం సహాయకులు రైతాంగానికి వివరిస్తున్నారు. మొలకెత్తిన విత్తనం వేసేందుకు వీలున్న నాలుగు ప్లాస్టిక్ డబ్బాలను కలిపి, ప్రతి డబ్బాకు 20 సెం.మీ. దూరంలో రంధ్రాలు చేయాలి. పరికరం సులువుగా కదలటానికి ఇరువైపులా రెండు పెద్ద చక్రాలు ఏర్పాటు చేయాలి. దానిని లాగడానికి అనువుగా హ్యాండిల్‌ని కూడా ఏర్పాటు చేసుకోవాలి. ఇలా తయారుచేసిన తరువాత దీని బరువు 10 కిలోలను మించి ఉండదు. కొద్దిగా మొలకెత్తిన విత్తనాలను ఆ నాలుగు డబ్బాల్లో పోసి, దమ్ము చేసి, చదును చేసిన పొలాల్లో పెట్టి ముందుకు లాగడం ద్వారా విత్తనాలను నాటుకోవచ్చు. ఈ విధంగా చేయడం వలన ఎకరాకు 10 నుంచి 12 కిలోల విత్తనం సరిపోతుంది. ఇద్దరు మనుషులు మూడు గంటల్లో ఒక ఎకరం పొలంలో ఈ విధంగా విత్తనాలు విత్తేందుకు అవకాశం ఉంది.

కలుపు నివారణ కీలకం

ఈ విధానంలో మొక్కల పెరుగుదలతో పాటు కలుపు కూడా పెరిగే అవకాశం ఉన్నందున, 15 నుండి 20 రోజులలో కలుపు నివారణకు మందులను వాడాలి. అలాగే దమ్ములో 150 కిలోల సూపర్ పాస్ఫేట్‌తో పాటు, 15 కిలోల పొటాష్ ఎరువును, విత్తిన 15 రోజులకు నత్రజని ఎరువును వేయాలి.

నియోజకవర్గంలో..

ప్రస్తుత రబీ సీజన్‌లో నియోజకవర్గంలో సుమారు 29,015 ఎకరాలలో వరి పంటను సాగు చేస్తారని అంచనా. మండలాల వారీగా చూస్తే రాజానగరంలో 12,125, కోరుకొండలో 9,038, సీతానగరంలో 7,852 ఎకరాలలో వరి పంటను సాగు చేస్తారు. రాజానగరం మండలంలో ముమ్మరంగా వరి నాట్లు పడుతుండగా, కోరుకొండ, సీతానగరం మండలాలలో నెమ్మదిగా సాగుతున్నాయి. ఈ క్రమంలో వరి నాట్లు ఆలస్యమవుతున్న ప్రాంతాలో డ్రమ్ము సీడర్ ఉపయోగం ఎంతగానో ఉంటుంది.

దీనితో నాట్లు ఉత్తమం



డ్రమ్ము సీడర్‌తో వరి నాట్లు వేయడం వలన సాగులో సమయాన్ని ఆదా చేయడానికి, వేసిన నాట్లు క్రమపద్ధతిలో మొలకెత్తి, మంచి దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుంది. విత్తనం కూడా వృథా కాదు. నాట్లు వేయడంలో జరుగుతున్న జాప్యాన్ని ఈ విధానం ద్వారా నివారించవచ్చు. కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఈ పరికరాన్ని తయారు చేసి, రైతాంగానికి ఎంతగానో మేలు చేకూరుస్తోంది.

– దాట్ల రవి, రైతు, కలవచర్ల

మహాసభలు విజయవంతం చేయాలి

రంగంపేట: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 17వ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక, స్వర్ణోత్సవ మహాసభలు ఈ నెల 5, 6, 7, 8వ తేదీల్లో కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నామని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రాంబాబు, ఐ.విజయబాబు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ 5వ తేదీ ఉదయం 9 గంటలకు యూటీఎఫ్ సీనియర్ నాయకులు కె.సత్తిరాజు జాతీయ పతాకాన్ని, ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఐ.వెంకట్రావు ఎస్‌టీఎఫ్ పతాకం, యూటీఎఫ్ సీనియర్ నాయకులు జి.చిట్టిబాబు యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రజాచైతన్య సదస్సు, సాయంత్రం నాలుగు గంటలకు ఉద్యమ సదస్సు, సీనియర్ నాయకుల సందేశాలు, అనంతరం సత్కారాలు ఉంటాయన్నారు. రాత్రి 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 6న సాహిత్య, మహిళా సదస్సులు, ఉపాధ్యాయుల మహా ప్రదర్శన ఉంటుందన్నారు. 7న ప్రజా ప్రతినిధుల సభ, 8న నూతన జనరల్ కౌన్సిల్ ఎన్నికలు జరుగుతాయన్నారు.

డిప్యుటేషన్‌పై తహసీల్దార్ బదిలీ

రాజానగరం: జిల్లా కలెక్టరేట్‌కు స్థానిక తహసీల్దార్ ఎస్.లక్ష్మీలావణ్యను డిప్యుటేషన్‌పై బదిలీ చేస్తూ కలెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో ప్రస్తుతం కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్(తహసీల్దార్)గా ఉన్న జి.అనంతలక్ష్మి సత్యవతిదేవిని డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. పరిపాలనాపరమైన అంశంలోనే ఈ బదిలీలు చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని తెప్పోత్సవం


బలభద్రపురంలో తెప్పోత్సవంలో వేంకటేశ్వర స్వామికి పూజలు


అనపర్తిలో వీరుళ్లమ్మ వారి చిత్రపటంతో భక్తుల ఊరేగింపు

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బ్రహోత్సవాల చివరిరోజు స్వామివారికి హంసపై తెప్పోత్సవం గురువారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. నీలమేఘశ్యాముని దివ్య తేజస్సును దర్శించుకున్న భక్తకోటి పులకించింది. పుష్కరిణిలో తెప్పలపై కొలువుదీరిన ఉత్సవమూర్తులను చూసి తన్మయత్వం చెందారు. అనంతరం స్వామివారికి ప్రవళింపు సేవతో పది రోజులుగా జరుగుతున్న బ్రహోత్సవాలు పూర్తయ్యారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు నలమిల్లి రామచంద్రారెడ్డి (రాము) తదితరులు పాల్గొన్నారు. బలభద్రపురంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి వారు పట్టువస్త్రాలు, పండ్లు, పూలు సమర్పించారు. అనంతరం స్వామిరి ప్రత్యేక పూజలు చేసి, స్వామివారి తెప్పోత్సవం, ప్రవళింపు సేవల్లో పాల్గొన్నారు. అనంతరం పూర్ణ కుంభంతో స్వాగతం పలికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు, నల్లమిల్లి వెంకటరెడ్డి,(నేషనల్) భారతి దంపతులను కమిటీ సభ్యులు సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


స్వామివారి పవళింపు సేవలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

వీరుళ్లమ్మకు హరిద్రాభిషేకం

పెదపూడి: అనపర్తి వీరుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి హరిద్రాభిషేకం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన 1,008 మంది మహిళలు గోదావరి నదీ జలాలతో స్వయంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. ముందుగా ఆలయం నుంచి భారీగా అనపర్తి ఎర్రకాలువ వద్దకు చేరుకున్నారు. కాలువలోని నదీ జలాలను సేకరించిన కలశాలను శిరస్సుపై పెట్టుకుని మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి చిత్రపటంతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం కలశాల్లో హరిద్రాన్ని కలిపి వారే స్వయంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని కొలిచారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సామాజిక సమానత్వానికి ఫూలే కృషి


సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత, బహుజన సంఘాల ప్రతినిధులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు

రాజానగరం: సంఘ సంస్కర్త, కవయిత్రి, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే 194వ జయంతిని శుక్రవారం స్థానిక కొత్తకాలనీలో ఘనంగా నిర్వహించారు. దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా కో-కన్వీనర్ మేకల లక్ష్మీపతిరావు, స్థానిక నాయకుడు ముప్పిడి శ్రీను మాట్లాడారు. భర్త జ్యోతిరావు పూలేతో కలిసి దేశంలో సామాజిక సమానత్వం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని వక్తలు కొనియాడారు.

విద్యతోనే మహిళా లోకానికి విముక్తి

సీతానగరం: సామాజిక దురాగతాల నుంచి మహిళా లోకానికి చదువుతోనే విముక్తి కలుగుతుందని, దీనిని ఆచరణాత్మకంగా చూపిన సంఘ సంస్కర్త, దేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అన్నారు. శుక్రవారం డిగ్రీ కళాశాలలో సావిత్రీబాయి పూలే జయంతి జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చిట్టిబాబు మాట్లాడుతూ, నాటి సమాజంలోని కట్టుబాట్లతో మహిళలు బయటకు రాలేని పరిస్థితుల్లో, ఇంటింటికీ తిరిగి వారిని బడికి తెచ్చి సావిత్రీబాయి పూలే మహిళా విద్యకు బాటలు వేశారని కొనియాడారు. ఎస్ఎస్ఎస్ పీఓ డాక్టర్ సుధామయి మాట్లాడుతూ, విద్యావేత్త అయిన జ్యోతిరావు పూలే ప్రేరణతో, నిమ్నవర్గాల అభ్యున్నతికి పుణెలో తొలి బాలికా పాఠశాలను నిర్మించిన అపూర్వ నారీశక్తి సావిత్రీబాయి పూలే అని ప్రశంసించారు. ప్రతి బాలిక చదువుకుంటే ప్రపంచం తీరు మారుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ డి.నాగేశ్వరరావు, వీవీ సుబ్బారావు, డాక్టర్ బి.మాధవ్ పాల్గొన్నారు.


పందలపాకలో సత్కారం పొందిన మహిళా ఉపాధ్యాయులు


కోరుకొండలో సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



సావిత్రీబాయి పూలే అవార్డును అందుకుంటున్న శిరీషకుమారి

మహిళా ఉపాధ్యాయులకు సత్కారం

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని శ్రీపడాల పెద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కొనాల సత్తిరాజు, పీడీ దార్వంపూడి యువరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ సాధనకు పోరాటం

మధురపూడి: సామాజిక న్యాయ సాధనలో అహర్నిశలు కృషి చేసిన సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కోరుకొండ మండలంలోని గుమ్ములూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సరస్వతి విద్యా నికేతన్, ఇతర పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ, మహిళల హక్కుల సాధన కోసం కృషి చేసిన వీరవనిత అని కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో గుమ్ములూరు హెచ్ఎం గంగాభవాని, నాగేశ్వరరావు, హేమంత్‌కుమార్, నూకరాజు, జాకబ్‌రాజు పాల్గొన్నారు.

టీచర్ శిరీషకు అవార్డు

కోరుకొండ మండలం గాదాల జెడ్పీ హైస్కూల్ తెలుగు టీచర్ పిట్టా శిరీషకుమారి శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు. సావిత్రీబాయి పూలే జయంతి ఉత్సవాల సందర్భంగా ఆమె ఈ అవార్డు పొందారు. రెండేళ్ల క్రితం రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయరాలిగా అవార్డు అందుకున్నారు. అలాగే కరోనా మహమ్మారి కాలంలో విద్యార్థులకు వివిధ బోధనా పద్ధతులను అవలంబించారు. స్కూల్ హెచ్ఎం నిర్మలా జ్యోతి ఆమెకు అభినందనలు తెలిపారు.

చక్రద్వారబంధంలో అగ్ని ప్రమాదం

- షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం
- రూ.2 లక్షల ఆస్తి నష్టం


మంటలకు ఇంట్లో కాలిపోతున్న సామగ్రి

రాజానగరం: మండలంలోని చక్రద్వారబంధంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక పూరిళ్లు దగ్ధమై, సుమారు రూ.రెండు లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న కోనే వీరబాబు కుటుంబం ఈ ఘటనలో కట్టుబట్టలతో మిగిలింది. ప్రమాద సమయంలో అంతా ఇంటి వద్దే ఉన్నప్పటికీ, మంటలను ఆర్పేందుకు వారు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో సిమ్మెంటు ఇటుకలతో కట్టిన గోడలే మిగిలాయి. తాటాకుల పైకప్పుతో పాటు ఇంటిలో దాచిన 25 కాసుల బంగారు నగలు, పొలం పత్రాలు, ఫర్నిచర్, నిత్యావసర వస్తువులు కాలి బూడిదయ్యాయి. రాజమహేంద్రవరం నుంచి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నప్పటికీ, ఫలితం లేకపోయింది. అప్పటికే మంటల్లో అంతా కాలిపోయింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ భార్య వెంకటలక్ష్మి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తక్షణ సాయంగా రూ.ఐదు వేల నగదును, బియ్యం బస్తాను అందజేశారు.

విజయదుర్గమ్మకు పంచామృతాభిషేకాలు


వడిశలేరులో వరాహ అవతారంలో భజేనారాయణస్వామి


సంపరలో ప్రత్యేక అలంకరణలో..

పెదపూడి: సంపర విజయదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు శుక్రవారం నిర్వహించారు. అలాగే కుంకుమ పూజలు చేశారు. అమ్మవారిని వివిధ పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో లలితా, విష్ణు సహస్ర పారాయణ చేయించారు.

రంగంపేట: స్థానిక మంచినీటి చెరువు వద్ద విజయదుర్గమ్మకు ఆలయ అర్చకుడు నారాయణ ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. చంద్రేడులోని కనకదుర్గమ్మ ఆలయంలో అర్చకుడు మైలవరపు కృష్ణ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

వరాహ అవతారంలో భజేనారాయణస్వామి

వడిశలేరులోని భజేనారాయణస్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని స్వామివారిని వరాహ అవతారంలో అలంకరించారు. అర్చకుడు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం నరసింహ అవతారంలో స్వామివారు దర్శనమిస్తారని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి పి.ప్రియాంక తెలిపారు.

త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు ప్రారంభం


త్యాగరాజ ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసిన అతిథులు

పెదపూడి: అనపర్తి శారద సంగీత కళాసమితి ఆధ్వర్యంలో 26వ త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయవాడకు చెందిన కళారత్న విద్వాన్ మోదుమూడి సుధకార్ గాత్ర కచేరితో ఉత్సవాలు ప్రారంభించారు. అర్తమూరు ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సత్తి బులిస్వామిరెడ్డి సౌజన్యంతో ఉత్సవాలు ఏర్పాటు చేశారు. దీనికి అనపర్తి విజయసాయి ట్రేడర్స్ అధినేత నల్లమిల్లి శ్రీనువాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్వాన్ పాలపర్తి నాగేశ్వరరావు వయోలిన్, విద్వాన్ కార్తికేయ ఆదినారాయణ శర్మ మృదంగ సహకారంతో విద్వాన్ సుధాకర్ గాత్ర కచేరి అలరించింది. అనంతరం భక్తులకు సత్తి జనార్దన్‌రెడ్డి తీర్థ ప్రసాదాలు అందించారు. సమితి అధ్యక్షుడు తమలంపూడి చిన ఆదిరెడ్డి, ఉపాధ్యక్షుడు నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, సభ్యులు నల్లమిల్లి వెంకటమునేశ్వరరెడ్డి, సత్తి రామారెడ్డి, పాలి ఆంజనేయులు, కర్రి వెంకటరామ కృష్ణారెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హడావుడి చర్యలు.. నాణ్యతకు తిలోదకాలు


జాంపేటలో కొత్తగా నిర్మించిన రోడ్డుపై తేలిన రాళ్లు

రాజమహేంద్రవరం సిటీ: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. గుంతలు లేని రహదారులు నిర్మిస్తామంటూ కూటమి పాలకులు చేపట్టిన నిర్మాణ పనుల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాజమహేంద్రవరం నగరంలో 50 డివిజన్లలోని 95 సచివాలయాల పరిధిలో 614 చోట్ల రహదారాల్లో గుంతలను నగరపాలక సంస్థ అధికారులు గుర్తించారు. వీటి మరమ్మతులకు నగరపాలక సంస్థ రూ.85 లక్షలకు అంచనా వేసింది. ఈ మేరకు గతేడాది నవంబర్ రెండో తేదీన నగరంలో గుంతలు పూడ్చే కార్యక్రమానికి కూటమికి చెందిన సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కంబాల చెరువు సెంటర్‌లో శ్రీకారం చుట్టారు. గుంతలు పూడ్చాలన్న హడావుడి మినహా.. పనుల్లో ఎంతమాత్రం నాణ్యత లేదని స్థానికులు పెదవి విరుస్తున్నారు. రోడ్లకు మరమ్మతులు పూర్తి చేసిన వెనువెంటనే రహదారిలో రాళ్లు తేలిపోతున్నాయని చెబుతున్నారు. ఏమాత్రం చిన్నపాటి వర్షం కురిసినా మరమ్మతులు చేసిన రోడ్డు పూర్తిగా ధ్వంసమయ్యే పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో ఇప్పటి వరకు 365 మరమ్మతు పనులు పూర్తి చేయగా, 249 గుంతలను పూడ్చే కార్యక్రమం చేపట్టాల్సి ఉంది.

అధికారుల పర్యవేక్షణ ఉండాలి

నగరంలో వర్షాల కారణంగా గుంతలు పడ్డ రహదారులను హడావుడిగా మరమ్మతులు చేపట్టడం వల్ల కొద్ది రోజులకే మళ్లీ గోతులు పడే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. పూర్తి స్థాయిలో అధికారులు పర్యవేక్షణతో, నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు చేపట్టాలి.